సాక్షి నిజామాబాద్

శనివారం । 18 । మార్చి । 2023



మేకల సంతకు ముగిసిన వేలం

నవీపేట మేకల సంతకు శుక్రవారం నిర్వహించిన వేలం పాటలో రూ. 55 లక్షల ఆదాయం వచ్చింది.

- IIలో ▸



కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. పరీక్ష కేంద్రాలను డీఐఈవో రఘురాజ్ పరిశీలించారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
32.2 /21.1

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నేటితో ప్లాట్ల వేలం ప్రక్రియ ముగింపు

సుభాష్‌నగర్: నగర శివారులోని మల్లారం వద్ద ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన ధాత్రి టౌన్‌షిప్‌లో ప్లాట్ల విక్రయాల కోసం చేపట్టిన బహిరంగ వేలం ప్రక్రియ శనివారంతో ముగియనుంది. 16, 17, 18 తేదీల్లో కొత్త కలెక్టరేట్‌లో బహిరంగ వేలంపాట నిర్వహణకు జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లుచేసిన విషయం విదితమే. శనివారం నాటితో గడువు ముగియనున్నందున ఔత్సాహికులు అందుబాటులో ఉన్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. 150 ప్లాట్ల విక్రయానికి రెండో విడతలో చేపట్టిన వేలం ప్రక్రియ శనివారంతో ముగియనున్న దృష్ట్యా ఔత్సాహికులు ప్లాట్లను సొంతం చేసుకునేందుకు పాల్గొనాలని కలెక్టర్ కోరారు.

పేదలందరికీ పక్కా ఇళ్లు



వర్ని: బాన్సువాడ నియోజకవర్గంలో ఇళ్లులేని పేదలందరికీ పక్కా ఇల్లు ఉండాలన్నదే తన లక్ష్యమని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వర్నిలోని షాదీఖానాలో శుక్రవారం డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులకు బిల్లు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సహకారంతో బాన్సువాడ నియోజకవర్గానికి 11 వేల డబుల్‌బెడ్‌రూం ఇళ్లు మంజూరయ్యాయని వివరించారు. త్వరలో రూ. మూడు లక్షల హౌసింగ్ స్కీం వస్తుందని, అర్హులైన వారందరికీ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. అలాగే వర్ని మండలం మల్లారంలో కంటి వెలుగు శిబిరాన్ని స్పీకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ హరిదాస్, వైస్ ఎంపీపీ దండ్ల బాల్‌రాజ్, హౌసింగ్ డీఈ నాగేశ్వరరావ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కలాల్‌గిరి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



నిజామాబాద్‌అర్బన్: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ల ఆఫీసర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్‌లో జరిగే ఈ పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామన్నారు. ప్రతి సెంటర్లో అన్ని సౌకర్యాలు ఉండేలా ప్రతి అధికారి బాధ్యతగా తీసుకోవాలన్నారు. తాగునీరు సదుపాయం, ఫ్యాన్ల ఏర్పాటు ఉండాలన్నారు. పరీక్షల నిర్వహణలో నిబంధనలకు లోబడి ప్రతిఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ప్రతి సెంటర్ వద్ద ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. అనంతరం డీఈవో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లకు పరీక్ష నిర్వహణకు సంబంధించి గైడ్‌లైన్స్ అందించడం జరిగిందని, తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరిగేలా చూడాలన్నారు. ప్రత్యేక బృందాలు జిల్లా అధికారులు ఆకస్మిక తనిఖీలు చేయడం జరుగుతుందన్నారు. సమావేశంలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

పెర్కిట్‌లో యాత్ర నిర్వహిస్తున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, షబ్బీర్ అలీ, ఈరవత్రి అనిల్, ఆర్మూర్ నాయకులు చిన్న



సాధించుకుందాం..
ఇందిరమ్మ రాజ్యం

- మతం ముసుగులో ప్రజలను చీల్చే కుట్ర చేస్తున్న బీజేపీ
- తాను పీసీసీ అధ్యక్షుడు కావడానికి ఆర్మూర్ రైతుల దీక్ష మొదటి మెట్టు
- ఆస్తులు పెంచుకోవడంపైనే ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, ఆయన సోదరుడి దృష్టి
- ఆర్మూర్ కార్నర్ మీటింగ్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విమర్శలు

ఆర్మూర్: వ్యవసాయ రంగ అభివృద్ధిలో భాగంగా సాగునీటి ప్రాజెక్టులు, విద్య, వైద్య రంగాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను తిరిగి సాధించుకోవాలంటే తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం సాధించుకోవడం ఒక్కటే మార్గమని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పిలుపు నిచ్చారు. హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా పెర్కిట్ శివారు నుంచి మామిడిపల్లి చౌరస్తా మీదుగా ఆర్మూర్‌లోని పాత బస్టాండ్ వరకు శుక్రవారం పాద యాత్ర నిర్వహించారు. మహిళలు బోనాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

కాంగ్రెస్‌ను ఓడించడం తగునా..

కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలో నిజాంసాగర్, శ్రీరాంసాగర్, పోచారం ప్రాజెక్టులు, గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతలు, మెడికల్ కళాశాల, తెలంగాణ యూనివర్సిటీలను ఏర్పాటు చేస్తే 2014లో తొమ్మిది మంది కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించడం తగునా అని రేవంత్ రెడ్డి ఓటర్లను ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లను అమలు చేశామన్నారు. 2019 తర్వాత పసుపు బోర్డు ఏర్పాటు కోసం ఆర్మూర్ ప్రాంత రైతాంగం చేస్తున్న ఉద్యమాల గురించి మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, మానాల మోహన్‌రెడ్డి తన దృష్టికి తీసుకు వచ్చి తనను ఉద్యమంలో పాల్గొనాలని సూచించారన్నారు.. ఆలస్యంగానైనా ఆ రైతు దీక్షకు తాను హాజరయ్యానన్నారు. తాను రైతులు, ప్రజలకు అండగా నిలబడటాన్ని గుర్తించి ఏఐసీసీ అధిష్టానం తనను పీసీసీ అధ్యక్షుడిగా నియమించిందనాన్నారు. 2021 జనవరి 30న నిర్వహించిన రైతు దీక్ష తాను పీసీసీ అధ్యక్షుడిని కావడానికి మొదటి మెట్టుగా ఉపయోగపడిందన్నారు. ఈ ప్రాంత రైతాంగానికి తాను రుణపడి ఉంటానన్నారు.

అంతకు ముందు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్, మాజీ మంత్రులు షబ్బీర్ అలీ, సుదర్శన్‌రెడ్డి, మాజీ విప్ ఈరవత్రి అనిల్ మాట్లాడారు. కార్నర్ మీటింగ్‌లో నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి అంజని కుమార్‌యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మార చంద్రమోహన్, ఏబీ శ్రీనివాస్ చిన్న, కోల వెంకటేశ్ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

దేశానికి ఆదర్శం ఆర్మూర్ రైతాంగం

దేశానికే ఆదర్శంగా నిలిచిన పసుపు, ఎర్రజొన్న, సోయా, చెరుకు పండించిన రైతులు అంకాపూర్ మొదలుకొని చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్నారని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లో నిర్మించుకున్న తరహా ఇళ్లు ఈ ప్రాంత రైతులు నిర్మించుకున్నారని అభినందించారు. ఆర్మూర్ ప్రాంతం మాజీ మంత్రి అర్గుల్ రాజారాం, మాజీ మంత్రి సంతోష్‌రెడ్డి లాంటి గొప్ప నేతలను అందించిందని, మాజీ సీఎం అంజయ్య సైతం ఆర్మూ ర్ నుంచే గెలుపొందాడన్నారు. అయితే కాంగ్రెస్‌లో ఉన్నత పదవులు అనుభవించిన సురేశ్ రెడ్డి, ఆకుల లలితలు బీఆర్ఎస్ నాయకుల చేతుల్లో ఓటమి పాలై, తిరిగి వారి పంచనే చేరి వారి ఎంగిలి మెతుకులకు దిగజారారని విమర్శించారు.

అకాల వర్షం.. రైతుకు నష్టం

- తడిసిన మక్కలు
- మక్క కంకి రంగు మారే అవకాశం
- తేమగా మారిన పసుపు కొమ్ములు
- నేల రాలిన మామిడి, నేలకొరిగిన 800 ఎకరాల్లో పొద్దుతిరుగుడు
- రెండ్రోజుల వర్ష సూచనలతో కర్షకుల్లో ఆందోళన



నిజామాబాద్ మార్కెట్ యార్డులో తడిసిన పసుపు సంచులు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : అకాల వర్షాల కారణంగా అన్నదాతలకు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో నష్టం వాటిల్లింది. అయితే మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేయడంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. గురువారం రాత్రి, శుక్రవారం కురిసిన వర్షాలతో జిల్లాలోని బోధన్, ఆర్మూర్ డివిజన్లలో కొన్ని మండలాల్లో కోతకు వచ్చిన మొక్కజొన్న పంటలు నేల కొరిగాయి. ఆరబెట్టిన మక్కలు తడిసాయి. మక్క కంకి రంగు మారే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో 23,986 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఇప్పటికే 50 శాతం పంట కోత పూర్తయింది. రోడ్లు, కల్లాలపై ఆరబెట్టిన మక్కలు, ఎర్రజొన్నను కాపాడుకునేందుకు రైతులు టార్పాలిన్లు కప్పి ఉంచారు. కాగా జిల్లాలో పసుపు పంట అమ్మకాలు దాదాపు 60 శాతం పూర్తయ్యాయి. కల్లాలపై ఉన్న కొమ్ములు వర్షానికి తేమగా మారాయి. నిజామాబాద్ మార్కెట్ యార్డుకు రైతులు తెచ్చిన పసుపు స్వల్పంగా తడిసింది. షెడ్లు, టార్పాలిన్లు ఉండడంతో పెద్దగా నష్టం వాటిల్లలేదు. ఇదిలా ఉండగా భారీ వర్షం, ఈదురు గాలులకు ప్రధానంగా జిల్లాలో మామిడి పంటకు ఎక్కువ నష్టం జరిగినట్లు తెలుస్తోంది. జిల్లాలో వెయ్యి ఎకరాల్లో మామిడి సాగు అవుతుండగా, తాజా వర్షంతో పిందె దశ నుంచి కాయ దశకు వస్తున్న మామిడి నేల రాలింది. దీంతో మామిడి రైతులకు కొంత నష్టం వాటిల్లింది. వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు మాత్రం జిల్లాలో పంట నష్టం జరగలేదని చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో కొంత నష్టం ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంతో సర్వే నిర్వహించలేదని రైతులు ఆరోపిస్తున్నారు. బోధన్, సాలూర మండలాల్లో జాడి జమాల్‌పూర్, సాలూర క్యాంప్, సాలంపాడ్ గ్రామాల్లో సుమారు 800 ఎకరాల్లో పొద్దుతిరుగుడు పంట నేలకొరిగిందని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. మొక్కజొన్న వంద ఎకరాల మేర నేలకొరిగినట్లు అంచనా. అధికారికంగా పంట నష్టంపై స్పష్టత లేదు.

అకాల వర్షానికి పంటల నష్టం

కమ్మర్‌పల్లి: గాలులతో కూడిన వర్షానికి కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌లో మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లింది. కల్లాలో ఆరబోసిన మక్కలు తడిసిపోయాయి. చేలలోని మొక్కజొన్న పంట నేలకొరిగింది. కోతకు వచ్చిన మొక్కజొన్న నేలకొరగడంతో యంత్రంతో కోతలకు ఇబ్బంది ఏర్పడుతుందని రైతులు వాపోతున్నారు. అదనంగా కూలీల భారం మీద పడుతుందన్నారు.



నందిపేట మండలం బజార్‌కొత్తూరు వద్ద నేలకొరిగిన మక్క పంట

ఫుడ్ పార్క్‌ను గాలికొదిలేశారు..

నందిపేట్(ఆర్మూర్): రూ. వేలాది కోట్లతో ఏర్పాటు చేసిన ఫుడ్‌పార్కును గాలికొదిలేసిన అసమర్థ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంటూ టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం నందిపేట మండలంలోని లక్కంపల్లి గ్రామ శివారులోని స్మార్ట్ అగ్రో ఫుడ్ పార్కు (సెజ్)ను రేవంత్‌రెడ్డి నాయకులతో కలిసి సందర్శించారు. లక్కంపల్లి సెజ్ భూముల్లో ఇప్పటి వరకు ఎన్ని పరిశ్రమలు స్థాపించారని, ఎంతమందికి ఉపాధి కల్పిస్తున్నారని ఫుడ్‌పార్కు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ 2008లో యూపీఏ ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఫుడ్ పార్కుకు అనుమతి ఇచ్చిందన్నారు. ఆనాటి కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డి చొరవతో కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి శరద్‌పవర్‌ను ఒప్పించి 470 ఎకరాల్లో సెజ్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఇందులో పసుపు, మొక్కజొన్న, సోయాబీన్ పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని 2016లో బీజేపీ ప్రభుత్వం ప్రకటించి మాట తప్పిందన్నారు. బీఆర్ఎస్ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీల అరాచకాల వల్ల రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామిక వేత్తలు జంకుతున్నారన్నారు. పతాంజలి పరిశ్రమ నెలకొల్పుతారని ఆర్భాటాలు చేశారని, అయితే వెనక్కి తరలిపోయిందన్నారు. ఇందుకు కారకులు ఎవరో అర్థమవుతోందన్నారు. తెలంగాణకు చెందిన ఓ పారిశ్రామిక వేత్త ముందుకు వచ్చినా సీఎం అందుబాటులోకి రాలేదన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని స్థానిక ఎమ్మెల్యే పారిశ్రామిక వేత్తను బెదిరించారన్నారు. నందిపేట సెజ్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అవినీతికి బలై పోయిందన్నారు. తక్షణమే ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుపై సీఎం కేసీఆర్ రివ్యూ చేయాలన్నారు. ఎంపీ అర్వింద్ కేంద్రం నుంచి సహకారం తీసుకుని పరిశ్రమలు నెలకొల్పేలా కృషి చేయాలని హితవు పలికారు.



సెజ్‌లో అధికారులతో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

కార్యక్రమంలో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, అర్బన్ ఇన్‌చార్జి తాహెర్‌బిన్ హుందాన్, నగర అధ్యక్షులు కేశవేణు, మండల నాయకులు పెంట ఇంద్రుడు, దేగాం గంగారెడ్డి, పిప్పెర సాయరెడ్డి, మంద మహిపాల్, బైండ్ల ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

క్రిమినల్ పాండు

- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిపై కాంగ్రెస్ చార్జ్‌షీట్



చార్జ్‌షీట్‌ను విడుదల చేస్తున్న ఈరవత్రి అనిల్

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి క్రిమినల్ కార్యకలాపాలకు కేరాఫ్‌గా మారాడని, క్రిమినల్ పాండుగా పేరుపొందాడని మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ ఆరోపించారు. జీవన్‌రెడ్డి లెక్కలేనన్ని హత్య కేసుల్లో నిందితుడిగా ఉన్నాడన్నారు. ప్రజలు మర్చిపోలేని తలారి సత్యం హత్య కేసులో ఎమ్మెల్యేపై హత్యానేరం కేసు నమోదైందన్నారు. అదేవిధంగా దళితులపై దాడులను ప్రోత్సహిస్తున్నాడన్నారు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయని ప్రశ్నించినందుకు మైలారం బాలుపై(ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు) అనుచరులతో దాడి చేయించారన్నారు. మాక్లూర్ పీఏసీఎస్‌లో రూ.30 లక్షల అవకతవకలపై గిరిజన బిడ్డ పోశెట్టి వార్త రాస్తే, అతడిపై ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కమలాపురం వద్ద హత్యాయత్నం చేయించాడన్నారు. మాక్లూర్‌ను దత్తత తీసుకుంటానని గత ఎన్నికల్లో హామీ ఇచ్చి మరిచారన్నారు. ఆర్మూర్ బస్టాండ్ స్థలాన్ని ఆక్రమించి మాల్ నిర్మించినట్లు ఆరోపణలున్నాయన్నారు. నందిపేటలో సర్వే నంబర్ 686/4లో ఉన్న రూ.50 కోట్ల విలువైన భూమిని కబ్జా చేశాడన్నారు. స్థిరాస్తి వ్యాపారులను బెదిరించి తక్కువ ధరకే భూములు గుంజుకుంటున్నారన్నారు. కమీషన్లు తీసుకుని ఎమ్మెల్యే అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇప్పిస్తున్నారన్నారు. అలాంటి నిర్మాణాలను కూల్చివేస్తున్న కమిషనర్‌ను సత్తార్ అనే కౌన్సిలర్‌తో బెదిరింపజేస్తున్నారన్నారు. కల్లెడ మాజీ సర్పంచ్ రూ.18 లక్షలు అప్పు తెచ్చి అభివృద్ధి పనులు చేయగా, జీవన్‌రెడ్డి వాటికి బిల్లులు మంజూరు కాకుండా చేశాడన్నారు.పైగా హైదరాబాద్‌లోని తన ఇంటికి పిలిపించుకుని బాధితుడిపై హత్యాయత్నం కేసు పెట్టించారన్నారు. బీఆర్ఎస్‌లో చేరనందుకు మహిళా సర్పంచ్ వాణిని ఎమ్మెల్యే వేధించాడన్నారు. ఆమెకు రూ.2 కోట్ల విలువైన బిల్లులు మంజూరు కాకుండా ఇబ్బందులు పెట్టడంతో, సర్పంచ్, ఆమె భర్త కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారన్నారు. సమావేశంలో పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హుందాన్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సాయిరెడ్డి పాల్గొన్నారు.

మున్సిపల్ మేనేజర్‌పై కమిషనర్ సీరియస్

- టౌన్‌ప్లానింగ్, శానిటేషన్‌లపై నివేదిక ఇవ్వాలని ఆదేశాలు
- ఆస్తిపన్ను వసూళ్లపై కూడా..

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: నగర మున్సిపల్ కార్పొరేషన్‌లోని ఆయా విభాగాల్లో జరుగుతున్న అక్రమాలపై 'సాక్షి'లో ప్రచురితమవుతున్న వరుస కథనాలపై కమిషనర్ చిత్రా మిశ్రా సీరియస్‌గా స్పందించారు. శుక్రవారం జరిగిన సమీక్షలో ముందుగా మేనేజర్ జనార్దన్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. శానిటేషన్, టౌన్‌ప్లానింగ్‌లో జరుగుతున్న అక్రమాలపై నివేదిక ఇవ్వాలని పలుమార్లు ఆదేశాలు ఇచ్చినా స్పందించకపోవడంపై మండిపడ్డారు. ఆయా విభాగాలకు చెందిన అధికారులతో 'సాక్షి'లో వచ్చిన కథనాలపై పూర్తిస్థాయి నివేదిక తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే ఆలస్యం చేశారని, త్వరగా నివేదిక ఇవ్వాలన్నారు. అలాగే ఆస్తిపన్ను వసూళ్లపై నివేదిక ఇవ్వాలన్నారు. మొండి బకాయిదారులకు నోటీసులు ఇచ్చి వసూలు చేయాలని కమీషనర్ ఆదేశాలు జారీ చేశారు.

ప్రిపరేషాన్!



- గ్రూప్–1తో పాటు మరో రెండు పరీక్షలు రద్దు
- నిరుద్యోగుల్లో నైరాశ్యం

నిజామాబాద్‌అర్బన్: టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 ప్రిలిమ్స్, ఏఈఈ, డీఏవో పరీక్షలు రద్దవడంతో అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. ప్రశ్నాపత్రాలు లీకవడం, పరీక్షలు రద్దు చేయడంతో నిరుద్యోగుల్లో నైరాశ్యం నెలకొంది. చాలాకాలం తర్వాత టీఎస్‌పీఎస్సీ నుంచి వరుసగా ఉద్యోగ నోటిఫికేషన్లు రావడంతో నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. కోచింగ్ సెంటర్లు, ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకుంటూ ప్రిపరేషన్ కొనసాగుతున్నారు. జిల్లాలో వేల మంది గ్రూప్–1 ప్రిలిమ్స్, ఏఈఈ, డీఏవో పరీక్షలు రాశారు. ప్రస్తుతం పరీక్షలు కాన్సిల్ కావడంతో సెలక్టయిన అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

ఆందోళనలో..

జిల్లాలో పోటీ పరీక్షలు రాసిన అభ్యర్థులు టెన్షన్ పడుతున్నారు. మరోవైపు జరగబోయే పరీక్షలపై ఆందోళన చెందుతున్నారు. గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష అక్టోబర్ 16న జరిగింది. ఇందులో జిల్లా వ్యాప్తంగా 12,858 మంది దరఖాస్తు చేసుకున్నారు. 9,990 మంది పరీక్ష రాశారు. అలాగే జనవరి 22న జరిగిన ఏఈఈ పరీక్షకు 3,170 మంది దరఖాస్తు చేసుకోగా 1,909 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఇటీవల నిర్వహించిన డీఏవో పరీక్షల్లో 6,512 మంది దరఖాస్తు చేసుకోగా 3వేలకు పైగా మంది పరీక్ష రాశారు. అయితే రద్దయిన పరీక్షలు మళ్లీ రాయడం కోసం అభ్యర్థులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు జరగబోయే గ్రూప్–2 3, 4 పరీక్షల విషయంలో నిరుద్యోగులు టెన్షన్ పడుతున్నారు. జూనియర్ లెక్చరర్ పరీక్ష, హాస్టల్ వార్డెన్ పరీక్షలకు కూడా వేల సంఖ్యలో దరఖాస్తులు చేసుకొని ప్రిపరేషన్ కొనసాగిస్తున్నారు.ఈ సమయంలో టీఎస్‌పీఎస్సీ లో ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారం బయట పడడంతో నిరుద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు. జరగబోయే పరీక్షలు కూడా సక్రమంగా జరుగుతాయా లేదంటే వాయిదా వేస్తారా అని టెన్షన్ పడుతున్నారు.



ఈ ఫొటోలోని యువతి పేరు సౌందర్య. పేద కుటుంబానికి చెందిన ఈ యువతి ఏడాదిన్నర నుంచి గ్రూప్స్ కోచింగ్ తీసుకుంటూ ప్రిపేర్ అవుతోంది. ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే తపన ఉంది. గ్రూప్–1 కూడా రాసింది. రానున్న పరీక్షలకు సిద్ధమవుతోంది. ఈ సమయంలో పేపర్ లీకేజీ వల్ల పరీక్షలు రద్దవడంతో మరింత కాలం కోచింగ్ తీసుకోవడం ఆర్థికంగా భారమవుతుందని వాపోతుంది.

నియామకాల్లోనూ అక్రమాలేనా?



తెలంగాణలో నియామకాల్లో కూడా అక్రమాలు జరగడం చాలా దారుణం. నీళ్లు నిధులు నియామకాలు అని చెప్పి తెచ్చుకున్న తెలంగాణలో నిరుద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గ్రూప్–1 ప్రిలిమ్స్ పాసై మెయిన్స్ కోసం ప్రిపేర్ అవుతున్న తరుణంలో పరీక్ష రద్దు చేయడం బాధించింది. –కళ్యాణి, ఎమ్మెస్సీ విద్యార్థిని, నిజామాబాద్

ప్రభుత్వం చర్యలు చేపట్టాలి



తక్షణమే ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీలో సమూలంగా మార్పులు చేయాలి. చైర్మన్‌తో సహా అందులో ఉద్యోగుల్ని తొలగించాలి. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. నిరుద్యోగులతో చెలగాటం ఆడుతున్న రాష్ట్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతాం. –లాల్‌సింగ్, తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

క్లుప్తంగా

విద్యుత్‌చౌర్యం చేస్తే చర్యలు



భిక్కనూరు : ఎవరైనా విద్యుత్‌ను చౌర్యం చేసి వాడుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాన్స్‌కో ఏడీ కిరణ్‌ చైతన్య అన్నారు. శుక్రవారం మండలంలోని శ్రీ సిద్దరామేశ్వరనగర్‌ గ్రామంలో విద్యుత్‌ కనెక్షన్లను ఆయన తనిఖీ చేశారు. గ్రామంలో శిథిలావస్థకు చేరిన విద్యుత్‌ స్తంభాలను వెంటనే మార్చాలని సిబ్బందికి సూచించారు. విద్యుత్‌ తీగలు ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా వేలాడుతుంటే సిబ్బంది వెంటనే సరిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట సబ్‌ ఇంజినీర్‌ శ్రీనివాస్‌, లైన్‌ఇన్‌స్పెక్టర్‌ బాల్‌రాజు, లైన్‌మన్‌ మాణిక్యం, జేఎల్‌ఎం లక్ష్మణ్‌ ఉన్నారు.

ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల గడువు పొడిగింపు

డిచ్‌పల్లి : సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నడుస్తున్న 5వ తరగతి 2023–24 విద్యా సంవత్సరానికి ప్రవేశపరీక్ష కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 20వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు సమన్వయాధికారిణి మేరీ ఏసుపాదం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–23 విద్యా సంవత్సరంలో ఏదైనా ప్రభుత్వ లేదా గుర్తింపు పొందిన పాఠశాలల్లో 4వ తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీలకు చెందిన విద్యార్థులు ఈ ప్రవేశ పరీక్షకు అర్హులన్నారు. ఆసక్తిగల వారు www.trwreir.ac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం www.trwreir.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించలన్నారు.

పాఠశాలలో చోరీ



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రం లోని బాలికల ప్రాథమిక పాఠశాల తలుపులు పగులగొట్టి చోరీ చేసినట్లు ఎస్సై శంకర్‌ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. పాఠశాల హెచ్‌ఎం సూరయ్య రోజువారీగా గురువారం మధ్యాహ్నం పాఠశాలకు తాళాలు వేసి వెళ్లారు. శుక్రవారం ఉదయం పాఠశాలకు వచ్చి చూడగా స్టాఫ్‌ రూం తలుపులు పగుటగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా టీచర్లు వేలిముద్రలు వేసే బయోమెట్రిక్‌ మిషన్‌, మైక్‌సెట్‌, స్పీకర్‌తో పాటు ఇతర చిన్న వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. దాంతో హెచ్‌ం సూరయ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పిర్యాదు చేశారు. ఎస్సై పాఠశాలకు చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న లారీ: ఒకరి మృతి



డిచ్‌పల్లి : డిచ్‌పల్లి మండలం లోని 44వ నెంబర్‌ జాతీయ రహదారిపై యూనివర్సిటీకి వెళ్లే రోడ్డులోని కేపీ దాబా వద్ద లారీ బైక్‌ ఢీకొని ఒకరు మృతిచెందినట్లు ఎస్సై గణేశ్‌ తెలిపారు. యూనివర్సిటీ రోడ్డులో ఏపీ 25ఎఫ్‌ 9119 నెంబర్‌ యమహా బైక్‌పై హుసేన్‌ఖాన్‌(19)ను అదే రూట్‌లో వెళ్తున్న టీఎస్‌ 52ఎల్‌ 9277 లారీ అతివేగంగా వచ్చి ఢీకొనడంతో బైకిస్టుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం 108లో నిజామాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు తెలిపారు. మృతుడు బీటెక్‌ సెకండియర్‌ చదువుతున్నట్లు తెలిపారు.

ర్యాగింగ్‌ ఘటనలో మలుపులెన్నో..

- సీపీకి ఫిర్యాదు చేసిన తిరుమల ఫార్మసీ విద్యార్థులు
- రెండు గ్రూపులుగా విడిపోయి..
- ఇద్దరు జూనియర్‌ విద్యార్థులపై కేసు
- నలుగురు విద్యార్థులపై సస్పెన్షన్‌ వేటు



సీపీని కలిసేందుకు వచ్చిన ఫార్మసీ విద్యార్థులు



కళాశాలలో విచారణ చేస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్‌

ఖలీల్‌వాడి : తిరుమల ఫార్మసీ కాలేజీ ర్యాగింగ్‌ వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. బీ ఫార్మసీ రెండో, మూడవ సంవత్సరం విద్యార్థులు పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. శుక్రవారం కళాశాలకు సంబంధించిన సెకండ్‌ ఇయర్‌, థర్డ్‌ ఇయర్‌ విద్యార్థులు ర్యాగింగ్‌ విషయమై రెండు గ్రూప్‌లుగా ఏర్పడి ఒకరిపై ఒకరు పోలీస్‌ కమిషనర్‌ నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. అయితే థర్డ్‌ ఇయర్‌ విద్యార్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేసి సెకండ్‌ ఇయర్‌కు చెందిన ఇదరు విద్యార్థులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆదివారం ఫెషర్స్‌ డే సందర్భంగా కళాశాలలో సెకండ్‌ ఇయర్‌ విద్యార్థులు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ వేడుకలకు థర్డ్‌ ఇయర్‌ విద్యార్థులను ఆహ్వానించేందుకు వెళ్లగా అక్కడ ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. అయితే సెకండ్‌ ఇయర్‌ విద్యార్థులు తమను సీనియర్లు ర్యాగింగ్‌కు పాల్పడ్డారని పేర్కొంటూ గురువారం తమ కుటుంబ సభ్యులకు సమాచారమివ్వగా వారు కళాశాలకు వచ్చి ఆందోళన చేశారు. డిచ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగానే ఇద్దరు సీనియర్‌ విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. తమ తల్లిదండ్రులను పిలిచినందుకు కళాశాల యాజమాన్యం నలుగురు విద్యార్థులను సస్పెండ్‌ చేసినట్లు విద్యార్థులు ఆరోపించారు.

విచారణ జరిపిన ఏసీపీ

డిచ్‌పల్లి(నిజామాబాద్‌ రూరల్‌) : డిచ్‌పల్లి మండలంలోని బర్దిపూర్‌ శివారులోని తిరుమల కాలేజీలో ర్యాగింగ్‌, దాడి ఘటనపై శుక్రవారం ఏసీపీ కిరణ్‌ కుమార్‌ సాయంత్రం విచారణ జరిపారు. కాలేజీకి సంబంధించిన నియమనిబంధనలు అడిగి తెలుసుకున్నారు. రెండు రోజులుగా కాలేజీలో జరుగుతున్న ఘటనకు సంబంధించిన వివరాలను యాజమాన్యాన్ని అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాలను ఏసీపీ పరిశీలించి, ఈ ఘటనకు సంబంధించి విద్యార్థులకు మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సీనియర్‌ విద్యార్థిని కొట్టిన ఘటనలో ఇద్దరు జూనియర్లపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు పరస్పరం సీపీ నాగరాజు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఈ విచారణకు ఏసీపీతో సీఐ మోహన్‌, ఎస్సై గణేష్‌లు పాల్గొన్నారు.

మేకల సంతకు ముగిసిన వేలం

- నవీపేట గ్రామ పంచాయతీకి రూ. 55,16,000 ఆదాయం
- వాయిదా పడ్డ కూరగాయల సంత వేలం



వేలం నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు

నవీపేట : మండల కేంద్రంలో ప్రతి శనివారం నిర్వహించే మేకల సంతకు శుక్రవారం నిర్వహించిన వేలం పాటలో రూ. 55,16,000ల ఆదాయం వచ్చింది. ఈనెల 13న మేకలు, కూరగాయల సంతలకు వేలం నిర్వహించారు. కానీ నిర్ణీత గడువులో నాల్గో వంతు డబ్బులు చెల్లించకపోవడంతో వాటిని రద్దు చేసి మళ్లీ నిర్వహించారు. మేకల సంతకు 38 మంది రూ. లక్ష చొప్పున డిపాజిట్‌ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. రూ. 55,13,000ల నుంచి వేలం నిర్వహించగా సిరాజుద్దీన్‌ అనే వ్యక్తి రూ. 55,16,000కు మేకల సంతను వేలంలో దక్కించుకున్నారు. అలాగే కూరగాయల సంతకు రూ. లక్ష చొప్పున డిపాజిట్‌ చెల్లించిన 12 మంది వేలంలో పాల్గొన్నారు. రూ. 15 లక్షల వద్ద వ్యాపారులు ఆగిపోయారు. దీంతో కనీస ధర రాలేదని ఈ సంత వేలాన్ని వాయిదా వేశారు. దీంతో పాటు వాటర్‌ ప్లాంట్‌, సులభ్‌ కాంప్లెక్స్‌లకు కనీస ధర రాకపోవడంతో వాయిదా వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ ఆసోల్ల శ్రీనివాస్‌, కార్యదర్శి రవీందర్‌నాయక్‌, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్‌ పరీక్షలు



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఐఈవో

నిజామాబాద్‌అర్బన్‌ : జిల్లావ్యాప్తంగా ఇంటర్‌ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం జరిగిన మొదటి సంవత్సరం ఇంగ్లిష్‌ పరీక్షకు 823 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో రఘురాజ్‌ తెలిపారు. మొత్తం 18,455 మంది విద్యార్థులకు గాను 17,632 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో జనరల్‌ విద్యార్థులు 15,933 మందికి గాను 15,365 మంది హాజరుకాగా అలాగే ఒకేషనల్‌లో 2,522 మంది విద్యార్థులకు గాను 2,267 మంది విద్యార్థులు హాజరయ్యారు. డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నపత్రాలు నిలువచేసిన కేంద్రాన్ని డీఐఈవో శుక్రవారం తనిఖీ చేశారు. డిచ్‌పల్లి పోలీస్‌ స్టేషన్‌ నుంచి ఐదు పరీక్ష కేంద్రాలకు ప్రశ్నపత్రాల ప్యాకెట్ల పంపిణీ చేసే ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. డిచ్‌పల్లి మోడల్‌ స్కూల్‌ కళాశాలను, మైనారిటీ రెసిడెన్షియల్‌ జూనియర్‌ కళాశాలను, డిచ్పల్లి ప్రభుత్వ జూనియర్‌ కళాశాలను, ధర్పల్లి మోడల్‌ స్కూల్‌ జూనియర్‌ కళాశాలను, ధర్పల్లి ప్రభుత్వ జూనియర్‌ కళాశాలను తనిఖీ చేసి సమీక్షించారు.

జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రవికుమార్‌, చిన్నయ్య, కనకమహాలక్ష్మి 12 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించగా, హైపవర్‌ కమిటీ రజియుద్దీన్‌ 7 పరీక్ష కేంద్రాలను, ఫ్లయింగ్‌ స్క్వాడ్‌లు, 8 సిట్టింగ్‌ స్క్వాడ్‌ బృందాలు 28 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించారు.

సిర్నాపల్లిలో ఎక్స్‌ప్రెస్‌ రైళ్లను ఆపాలి



వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్‌ తేలు విజయ్‌

ధర్పల్లి (ఇందల్వాయి) : ఇందల్వాయి మండలంలోని సిర్నాపల్లి రైల్వేస్టేషన్లో ఎక్స్‌ప్రెస్‌ రైళ్లను నిలిపేలా కృషి చేయాలని సర్పంచ్‌ తేలు విజయ్‌ ఆధ్వర్యంలో సౌత్‌ సెంట్రల్‌ రైల్వే ఏడీఆర్‌ఎం రామకృష్ణకు శుక్రవారం విన్నవించారు. రైల్వే విద్యుదీకరణ పనులను పరిశీలించడానికి వచ్చిన ఆయనను గ్రామస్తులు సిర్నాపల్లి రైల్వే స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సిర్నాపల్లి రైల్వేస్టేషన్‌లో రెండవ ఫ్లాట్‌ ఫారం ఏర్పాటు చేయాలని, రైల్వే ఫుడ్‌ ఓవర్‌ బ్రిడ్జి నిర్మించాలని ఆయనను కోరారు. ప్రయాణికుల భద్రత నిమిత్తం స్టేషన్‌ ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని విన్నవించారు. అంతేకాకుండా కాచిగూడ, అకోలా రైళ్లను స్టేషన్లో ప్రయాణికుల సౌకర్యం ఆగేలా చూడాలని ఏడీఆర్‌ఎంకు విన్నవించారు.

'బార్‌' ఎన్నికల సందడి

ఖలీల్‌వాడి : నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ 2023–24 వార్షిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో న్యాయవాదుల చాంబర్‌లో సందడి నెలకొంది. ఎన్నికల నోటిఫికేషన్‌లో భాగంగా మొదటి రోజైన శుక్రవారం అధ్యక్ష పదవికి రెండు, ఉపాధ్యక్షుడిగా ఒకరు, ప్రధాన కార్యదర్శిగా ఒకరు, సహాయ కార్యదర్శిగా ఒకరు నామినేషన్‌ పత్రాలను ఎన్నికల అధికారులు వెంకట రమణాగౌడ్‌, శైలేశ్‌కుమార్‌ దేశముఖ్‌లకు అందజేశారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్‌ హాల్‌లోని ఎలెక్షన్‌ డెస్క్‌లో ఎన్నికల అధికారులకు అధ్యక్ష పదవికి సీనియర్‌ న్యాయవాది, మాజీ గవర్నమెంట్‌ ప్లీడర్‌ పెద్దగాని కిరణ్‌ కుమార్‌గౌడ్‌, మరో సీనియర్‌ న్యాయవాది దేవదాసు చందక్‌ తమ నామినేషన్‌ పత్రాలను అందజేశారు. ఉపాధ్యక్షుడిగా సీనియర్‌ న్యాయవాది ఆశ నారాయణ నామినేషన్‌ పత్రాన్ని దాఖలు చేశారు. ప్రధాన కార్యదర్శిగా సీనియర్‌ న్యాయవాది ఈరవత్రి భాగిచరణ్‌ నామినేషన్‌ పత్రాలను అందజేశారు. మహమ్మద్‌ అయూబ్‌ సహాయ కార్యదర్శిగా, మహిళ ప్రతినిధిగా వరలక్ష్మి, స్పోర్ట్స్‌ అండ్‌ కల్చరల్‌ కార్యదర్శిగా బి.సత్యనారాయణగౌడ్‌, కార్యవర్గ సభ్యురాలిగా మానస తమ నామినేషన్‌ పత్రాలను దాఖలు చేశారు. శనివారం నామినేషన్లకు ఆఖరి రోజని మార్చి 21న నామినేషన్‌ పత్రాల పరిశీలన, 23న నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించి 24న పోటీలో ఉన్న అభ్యర్థులను ప్రకటిస్తామని వెల్లడించారు. 29న ఉదయం పదిన్నర గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్‌ జరుగుతుందన్నారు.

ఇందూరు తిరుమలలో సినీ సందడి



దిల్‌ రాజుతో కథ విషయమై చర్చిస్తున్న త్రినాథ రావు, కృష్ణ..

మోపాల్‌(నిజామాబాద్‌రూరల్‌) : మండలంలోని నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సినీ ప్రముఖులతో సందడిగా మారింది. నిత్యం సినిమాల్లో బిజీబిజీగా ఉండే ప్రముఖ నిర్మాత దిల్‌ రాజు ఐదారు రోజులుగా తన స్వగ్రామమైన నర్సింగ్‌పల్లిలోనే ఉంటున్నారు. దీంతో నిర్మాతలు, దర్శకులు ఆలయానికి వచ్చి సినిమాలకు కథలను విన్పిస్తున్నారు. అలాగే స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో పాలుపంచుకుంటూ ప్రత్యేక పూజలు చేస్తున్నారు. తాజాగా ధమాకా సినీ దర్శకుడు నక్కి త్రినాథ రావు, నిర్మాత కృష్ణ, గురువారం గుణశేఖర్‌, అనిల్‌ రావుపూడి వచ్చి కొత్త సినిమాలకు కథలను విన్పించినట్లు తెలిసింది.

మత్తులో వృద్ధురాలిపై దాడి

- దోంచందలో చోటు చేసుకున్న ఘటన
- యువకులు గంజాయి సేవించి ఉంటారని అనుమానం

మోర్తాడ్‌(బాల్కొండ): ఏర్గట్ల మండలం దోంచందలో కిరాణ దుకాణం నిర్వహిస్తున్న ఒక వృద్ధురాలిపై ముగ్గురు యువకులు దాడికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. దోంచందకు చెందిన ఒక యువకుడితో పాటు ఏర్గట్లకు చెందిన మరో ఇద్దరు కారులో వచ్చి సిగరెట్లు కొనుగోలు చేశారు. వీటికి సంబంధించిన డబ్బులు అడిగినందుకు దుకాణంలోని సామగ్రిని చిందరవందర చేశారు. అడ్డు వచ్చిన వృద్ధురాలిని పక్కకు నెట్టేయడంతో ఆమె కిందపడి గాయాలపాలైంది.

వృద్ధురాలిపై దాడిని అడ్డుకోవడానికి వచ్చినవారిని దుర్భాషలాడుతూ చంపుతామని బెదిరించినట్లు తెలిసింది. ముగ్గురు యువకులు మత్తులో ఉన్నారని వారు మద్యం సేవించారా లేక గంజాయి సేవించారో అర్థం కాలేదని స్థానికులు తెలిపారు. కారును వేగంగా తిప్పుతూ ఒకరిద్దరిని ఢీకొట్టే ప్రయత్నం చేయగా వారు తప్పించుకున్నారు. ఈ విషయమై 'సాక్షి' ఏర్గట్ల ఎస్సై రాజును సంప్రదించగా వృద్ధురాలిపై దాడి ఘటన తన దృష్టికి వచ్చిందన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే ఎలాంటివారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. దోంచంద ఘటనపై విచారణ జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు.

పంటలు వర్షార్పణం..



సాలూర క్యాంప్‌ వద్ద నేలకొరిగిన పొద్దుతిరుగుడు పంట

జిల్లాలో అకాల వర్షం అన్నదాతను ఆగం చేసింది. వందల ఎకరాల్లో మొక్కజొన్న, పొద్దు తిరుగుడు పంట నేలకొరిగింది. గాలిదుమారానికి మామిడికాయలు రాలిపోయాయి. మరో రెండురోజులు వర్షం కురిసే అవకాశముండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.



మాక్లూర్‌లో తోటలో నేలరాలిన మామిడి పిందెలు



కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్‌లో వర్షానికి తడిసిన మక్కలను ఆరబెడుతున్న రైతు



ఉప్లూర్‌లో నేలకొరిగిన మొక్కజొన్న పంట



సాలూర మండలం కొప్పర్తి క్యాంప్‌ వద్ద నేలకొరిగిన మక్క పంట

చిన్నారి గాయాలపాలు

- వేడిపాలు పడి నాలుగేళ్ల పునర్వికి తీవ్రగాయాలు
- చికిత్సకు డబ్బులేక తల్లిదండ్రుల అవస్థలు
- సాయంకోసం ఎదురుచూపులు



గోపాల్‌పేటలోని ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి పునర్వి

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : వేడివేడి పాలు మీద పడి ఓ చిన్నారి నరకయాతన అనుభవిస్తోంది.. ఆ చిన్నారి బాధను తట్టుకోలేక తల్లిదండ్రులు అల్లాడిపోతున్న ఘటన నాగిరెడ్డిపేటలో ఆలస్యంగా వెలుగుచూసింది. నాగిరెడ్డిపేటకు చెందిన తెనుగు కిష్టయ్య, ఏసవ్వ దంపతుల కూతురు మాధవిని కొంతకాలం క్రితం ఎల్లారెడ్డి మండలం అల్మాజీపూర్‌కు చెందిన బొల్లారపు సంగమేశ్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. కాగా మాధవి తన నాలుగేళ్ల కూతురు పునర్వితో కలిసి కొన్నిరోజులుగా తన తల్లిగారి ఇంట్లో ఉంటుంది. రెండురోజుల క్రితం మాధవి గ్యాస్‌పొయ్యిపై పాలను వేడిచేసి పెట్టింది. అదే సమయంలో పునర్వి గ్యాస్‌పొయ్యి పైపును పట్టుకొని లాగడంతో పొయ్యి కదిలి దానిపై ఉన్న వేడిపాలు ఆ చిన్నారిపై పడ్డాయి. దీంతో తీవ్రగాయాలయ్యాయి. దీనిని గుర్తించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం పునర్విని మండలకేంద్రం గోపాల్‌పేటలోని ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా వేడిపాలు మీదపడడంతో పునర్వి 35–40శాతం గాయపడిందని ఆస్పత్రి వైద్యుడు పేర్కొన్నారన్నారు. కడు బీదరికంలో ఉన్న పునర్వి తల్లిదండ్రులు ప్రస్తుతం ఆమెకు చికిత్స చేయించలేకపోతున్నారు. రెండురోజుల్లోనే రూ. 20వేల వరకు ఖర్చయ్యాయని..దాతలెవరైన ముందుకొచ్చి తమను ఆదుకోవాలని తల్లిదండ్రులే వేడుకుంటున్నారు.

దాతలు ఆర్థిక సహాయం చేయాలనుకునేవారు పునర్వి తాత నగేశ్‌ గూగుల్‌ పే, ఫోన్‌పే 94408 23521కు చేయవచ్చు.

వ్యభిచారం కేసులో మూడేళ్ల జైలుశిక్ష

బోధన్‌టౌన్‌(బోధన్‌) : వ్యభిచారానికి ఆశ్రయం కల్పించి, వ్యభిచారం చేసిన కేసులో ఇద్దరికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ బోధన్‌ అసిస్టెంట్‌ సెషన్స్‌ న్యాయమూర్తి దేవన్‌ అజయ్‌కుమార్‌ శనివారం తీర్పు చెప్పారు. అడిషనల్‌ పీపీ సమ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రూర్‌ పీఎస్‌ పరిధిలోని అక్బర్‌ నగర్‌లోని ఓ ఇంట్లో వ్యభిచారం జరుగుతుందన్న సమాచారం మేరకు 2019 మార్చి 1న పోలీసులు ఓ ఇంటిపై దాడి చేయగా ఫాతిమాబీ, ఊషం మల్కయ్య, షేక్‌ లతీఫ్‌ వ్యభిచారం నిర్వహిస్తూ పట్టుబడ్డారు. ఇందులో వ్యభిచారానికి ఆశ్రయం కల్పించిన ఫాతిమాబీకి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 200 జరిమానా విధించారు. జరిమానా కట్టకపోతే మరో నెలరోజుల సాధారణ జైలు శిక్ష, అలాగే మరోమహిళతో వ్యభిచారం నిర్వహిస్తూ పట్టుబడ్డ ఊషం మల్కయ్యకు మూడేళ్ల జైలు, రూ. 300 జరిమానా, జరిమానా కట్టకపోతే 15రోజుల సాధారణ జైలు శిక్ష విధించారు. షేక్‌ లతీఫ్‌ విచారణ సమయంలోనే మృతి చెందాడు.

పోలీసుల అదుపులో నిందితులు



ధ్వంసమైన మీసాల చంద్రయ్య కారు(ఫైల్‌)

ఖలీల్‌వాడి : డిచ్‌పల్లి మండలంలోని మాధవనగర్‌ సాయిబాబా ఆలయం వద్ద ఈనెల 10న బీజేపీ జిల్లా ఇన్‌చార్జి మీసాల చంద్రయ్య వెళ్తున్న కారుపై రాళ్లదాడి జరిగిన విషయం విదితమే..ఈ సంఘటనపై బీజేపీ నాయకులు అదేరోజు రాత్రి డిచ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా దాడి చేసిన ఇద్దరిని పోలీసుల అదుపులోకి తీసుకుని విచారించి వదిలేసినట్లు సమాచారం. బీఆర్‌ఎస్‌ నేతలే ఆరోజు కారుపై దాడి చేసినట్లు నగరంలో జోరుగా ప్రచారం జరిగింది. అయితే జిల్లాకు చెందిన ఓ బీజేపీ ముఖ్య నాయకుడు పలువురికి డబ్బులు చెల్లించడంలో ఇబ్బందులకు గురిచేయడంతో వారు అతడిపై ఆగ్రహంగా ఉన్నారు. ఈనెల 10న మీసాల చంద్రయ్య వెళ్తున్న కారులో సదరు ముఖ్య నాయకుడు ఉన్నాడనే సమాచారంతో వారు కారుపై రాళ్ల దాడికి పాల్పడ్డట్లు తెలిసింది.

పెట్రోల్‌ పంప్‌ సిబ్బందిపై దాడి ఘటనలో..

నస్రుల్లాబాద్‌(బీర్కూర్‌) : బీర్కూర్‌ మండల కేంద్రంలో ఉన్న ఇండియన్‌ ఆయిల్‌ పెట్రోల్‌ పంపులో గురువారం రాత్రి పంపులో పనిచేసే వ్యక్తి నుంచి డబ్బులు తీసుకుని పారిపోవడానికి ప్రయత్నం చేశారు. ఫోన్‌పేలో డబ్బులు వేస్తామంటూ ఆఫీసులోకి వచ్చి విధుల్లో ఉన్న వ్యక్తిపై దాడి చేశారు. వెంటనే స్పందించిన స్థానికులు వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నిందితులు బాన్సువాడ పట్టణానికి చెందిన సందీప్‌, సోమేశ్వర్‌కు చెందిన సంతోష్‌లుగా పోలీసులు గుర్తించారు. నిందితులను అందుపులోకి తీసుకుని వివరాలను సేకరిస్తున్నామన్నారు. పెట్రోల్‌ పంప్‌లో డ్యూటీలో ఉన్న నాగరాజుకు తలపై గాయం కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

విద్యుత్‌షాక్‌తో గేదె మృతి



నిజామాబాద్‌ నాగారం : నగరంలోని కంఠేశ్వర్‌ శివారులో వ్యవసాయ పొలంలో యెండల సురేందర్‌కు చెందిన రైతు గేదె విద్యుత్‌షాక్‌కు గురై చనిపోయింది. విద్యుత్‌ అధికారులు చూసి పంచనామా చేశారు.

క్రైం కార్నర్‌

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

ఎల్లారెడ్డిరూరల్‌(ఎల్లారెడ్డి): కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై గణేష్‌ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి పట్టణంలోని చర్చి కాంపౌండ్‌లో నివాసముండే జంగమాయిపేట కార్తీక్‌ (35) తరుచు మద్యం సేవించి వచ్చి భార్యతో గొడవ పడేవాడని ఇదే విషయంలో గురువారం రాత్రి గొడవ జరగడంతో అతడు ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. భార్య, భర్తలు గొడవ పడడంతో భార్య కీర్తి బంధువుల ఇంటిలోకి వెళ్లి పడుకోగా కార్తీక్‌ ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని అన్నారు. మృతుడి భార్య కీర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు



గంజాయి విక్రేతల అరెస్ట్‌ను చూపుతున్న ఎక్సైజ్‌ పోలీసులు

ఆర్మూర్‌టౌన్‌ : నిజామాబాద్‌ జిల్లా బాల్కొండ మండలం పోచంపాడ్‌ గ్రామంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్‌ సీఐ స్టీవెన్‌సన్‌ తెలిపారు. వివరాలను ఆర్మూర్‌లోని ఎక్సైజ్‌ కార్యాలయంలో వెల్లడించారు. శుక్రవారం ఉదయం పోచంపాడ్‌ ప్రాజెక్ట్‌ సమీపంలోని ఒక షెడ్‌లో గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో ఎక్సైజ్‌ పోలీసులు దాడులు చేసి నిందితులు కల్యాణ్‌, సంతోష్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితులకు గంజాయి సరఫరా చేసిన నిర్మల్‌కు చెందిన రాజ్‌కుమార్‌ను సైతం అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 230 గ్రాముల గంజాయి, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ దాడుల్లో సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎ గంగాధర్‌, సిబ్బంది వికాస్‌ గౌడ్‌, నరేశ్‌, దేవిదాస్‌, మోహన్‌, సందీప్‌, సాయిలు పాల్గొన్నారు.